సాక్షి సిద్దిపేట

ఆదివారం । 28 । జనవరి । 2024



మట్టి పరీక్ష.. పంటకు రక్ష

మట్టి నమూనా పరీక్షలతో రైతులకు మేలని జయశంకర్ వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్తలు తెలిపారు. వివరాలు 8లో ▸



రేషన్ బియ్యం పట్టివేత

గజ్వేల్‌లో అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. వివరాలు 8లో ▸



నెట్‌వర్క్ తిప్పలు

మొబైల్ నెట్‌వర్క్ సరిగా లేక కొండపోచమ్మ జాతరకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడే మల్లన్న లష్కర్ వారం



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి వారాన్ని పట్నం వారంగా , రెండో ఆదివారంను లష్కర్‌వారంగా పిలుస్తారు. ఈవారానికి సికింద్రాబాద్ భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం స్వామివారికి పట్నాలు, బోనాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. లష్కర్‌వారం సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం




విద్యార్థులతో జిల్లా సెషన్స్ జడ్జి రఘురాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చట్టాలు, ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని జిల్లా సెషన్స్ జడ్జి డా. రఘురాం అన్నారు. శనివారం సిద్దిపేటలోని ఇందిరానగర్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన బాలల హక్కులు, చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే కోర్టు ఉద్యోగి వెంకటరామయ్య సహకారంతో అనాథ పిల్లలకు 100 ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి స్వాతిరెడ్డి, హెచ్‌ఎం, న్యాయవాదులు పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటరూరల్: సదరం శిబిరాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 27 వరకు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం శిబిరాలను వైకల్యాల వారీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి హాజరుకావాల్సిన దివ్యాంగులు తమ దగ్గరలో ఉన్న మీ సేవ, ఈసేవ సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు రసీదు, ఆధార్ కార్డుతో కోమటి చెరువు దగ్గరలో గల ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాజరుకావాలన్నారు. స్లాట్‌లు ఈనెల 30న ఉదయం 11.30 గంటలకు ఓపెన్ చేయనున్నట్లు చెప్పారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు జైపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ యోగా పోటీలకు మండలంలోని ఆకునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 7వ తరగతి చదువుతున్న వైష్ణవి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఐలయ్య తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించి మాట్లాడారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో జరిగిన యోగా రాష్ట్రస్థాయి పోటీల్లో వైష్ణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైందని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చీపురు రేఖ, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ కోతి దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురు సీఐల బదిలీ



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సీఐలు బదిలీ అయ్యారు. సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యారు. ఎస్‌బీ విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సురేందర్‌ను ధార్‌పల్లి సర్కిల్‌కు, టాస్క్‌ఫోర్స్ సీఐ జగదం నరేష్‌ను బిచ్‌కుంద సర్కిల్‌కు, సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్‌ను ఖమ్మంకు బదిలీ చేశారు. ఈమేరకు హైదరాబాద్ మల్టీజోన్ టూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీసీఐ కొనుగోళ్లకు మంగళం

సీజన్ ముగియకుండానే కేంద్రాల మూసివేత

- 31 నుంచి కార్యకలాపాలు బంద్
- ఆందోళనలో పత్తి రైతులు



గజ్వేల్‌లో పత్తి కొనుగోళ్లు

గజ్వేల్: సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు కేంద్రాల మూసివేతకు రంగం సిద్ధమైంది. ఈనెల 31 నుంచి కేంద్రాల్లో కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు మార్కెటింగ్ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. సీజన్ ముగియకుండానే కేంద్రాల మూసివేత నిర్ణయం తీసుకోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధర క్రమంగా తగ్గుతున్న వేళ.. రైతులంతా పత్తి అమ్మకాలకు సీసీఐ కేంద్రాలపైనే ఆధారపడ్డారు. ఈ క్రమంలోనే 6.16 లక్షల క్వింటాళ్ల పత్తిని ఆ సంస్థ కొనుగోలు చేసింది. ప్రైవేట్ వ్యాపారులు 2 లక్షల క్వింటాళ్లలోపే పత్తిని కొనుగోలు చేశారు. ఇంకా రైతుల ఇళ్లలో పత్తి నిల్వ ఉంది. కానీ అధికారుల తాజా నిర్ణయం శాపంగా మారింది.

ఆశించిన స్థాయిలో దక్కని 'మద్దతు'

జిల్లాలో 1.08 లక్షల ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చింది. వాతావరణం అనుకూలిస్తే సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ ఈసారి 6– 8 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. చేతికందిన దిగుబడులకు ఆశించిన స్థాయిలో మద్దతు ధర దక్కడం లేదు. జిల్లాలో 10 లక్షల క్వింటాళ్లకు పైగా ఉత్పత్తులు వస్తాయని అంచనా. పత్తికి గతేడాది రూ. 6,080– 6,380 మద్దతు ధర ఉండగా, ప్రభుత్వం ఈసారి రూ. 6,620–7,020 పెంచింది. ఇందులో మీడియం స్టేపుల్‌కు రూ. 6,620, లాంగ్ స్టేపుల్‌కు రూ.7,020 ధరగా నిర్ణయించిన సంగతి తెల్సిందే. సీజన్ ఆరంభంలో క్వింటాల్‌కు ధర బహిరంగ మార్కెట్‌లో రూ. 7 వేల వరకు పలికింది. ఇంకా ధర పెరుగుతుందని రైతులు ఎదురుచూశారు. కానీ భిన్నమైన పరిస్థితి ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ పడిపోవడంతో పత్తి గింజల ధర క్వింటాల్‌కు కొన్ని నెలల క్రితం రూ. 3,500 పలకగా నేడు రూ.2,700కు పడిపోయింది. క్యాండీ (356 కిలోలు) ధర రూ.70 వేల వరకు పలికితే నేడు అది రూ. 54 వేలకు పడిపోవడం రైతులకు శాపంగా మారింది. ఫలితంగా పత్తి ధర బహిరంగ మార్కెట్‌లో గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ. 6,000– 6400కు మించి పలకడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో రైతులు సీసీఐ కేంద్రాల్లోనైనా ప్రభుత్వం ప్రకటించిన ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికి మొగ్గుచూపుతున్నారు. జిల్లాలోని సిద్దిపేట, తొగుట, కొండపాక, దౌల్తాబాద్‌లో ఒక్కోటి చొప్పున, బెజ్జంకిలో 2, హుస్నాబాద్‌లో 4, గజ్వేల్‌లో 6, చేర్యాలలో 6 సీసీఐ కేంద్రాలు నడుస్తున్నాయి. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 6.16 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి కొనుగోళ్లు జరిగాయి. ఇకపోతే ప్రైవేట్ వ్యాపారులు ఇప్పటివరకు 1.96 లక్షల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

సీసీఐ అధికారులు ఈనెల 31 నుంచి కేంద్రాలను మూసివేస్తున్నట్లు సమాచారం ఇచ్చిన మాట వాస్తవమే. కానీ క్షేత్రస్థాయిలో రైతుల వద్ద పత్తి ఇంకా మిగిలే ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నాగరాజు, జిల్లా మార్కెటింగ్ అధికారి

80 శాతం మేర క్రయవిక్రయాలు

బహిరంగ మార్కెట్‌లో ధర పెరగక సీసీఐ కేంద్రాల్లో తమ ఉత్పత్తులను అమ్ముకుందామంటే సీజన్ ముగియకముందే ఆ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 80 శాతం మేర క్రయవిక్రయాలు జరిగినా మరో 20 శాతానికి పైగా ఉత్పత్తులు రైతుల ఇళ్లలోనే నిల్వ ఉన్నాయి. మరో నెల రోజుల పాటు సీసీఐ కొనుగోళ్లు సాగితేనే పూర్తిస్థాయిలో అమ్మకాలు జరిగే అవకాశముండేది. కానీ సీసీఐ అధికారులు జిల్లాలోని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఈనెల 31న కేంద్రాలను మూసివేస్తామని సమాచారమిచ్చారు. సీసీఐ కేంద్రాలు లేకపోతే ప్రైవేట్ వ్యాపారులు ధర అమాంతం తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సర్పంచ్‌ను అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్

కొండపోచమ్మ ద్వారా సాగు నీరు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- పాములపర్తి నూతన పంచాయతీ భవనం ప్రారంభం

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మసాగర్ ద్వారా వేసవిలో వ్యవసాయానికి సాగు నీరు విడుదల చేస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని పాములపర్తిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం ప్రత్యేక నిధి ద్వారా పాములపర్తి గ్రామాభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ప్రజాపాలన ద్వారా రాష్ట్రంలో కోటి 5 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆన్‌లైన్ చేశామని తెలిపారు. 420 గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకున్న కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, డీపీఓ దేవికీదేవీ, డీఎల్‌పీఓ వేదావతి, ఆర్డీఓ బన్సీలాల్, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, సర్పంచ్ తిరుమలరెడ్డి, ఎంపీపీ పాండుగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కనకయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కనకయ్య, జిల్లా నాయకులు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ, రవీందర్‌రెడ్డి, నరేందర‌రెడ్డి, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన 150 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతీ ఒక్కరిని పార్టీ కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడువక ముందే బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని బదనాం చేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, కొండపాక, కుకునూరుపల్లి మండల పార్టీల అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాల నేరస్తులకు న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. శనివారం జిల్లా జైలును ఆమె సందర్శించారు. జైలులో ఉన్న 18, 22 ఏళ్ల వయసు ఉన్న ఖైదీలను విచారించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి చందన, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. భవిష్యత్ మనదే..

- దళిత, బీసీ బంధులతో ఇబ్బంది పడ్డాం
- పార్లమెంట్ ఎన్నికల్లో గట్టిగా పనిచేయండి
- కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: అధైర్యపడొద్దు.. కొద్దిపాటి ఓట్ల శాతం తేడాతో అధికారం కోల్పోయాం. అయినా భవిష్యత్ మనదేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పార్టీ శ్రేణుల్లో భరోసా నింపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కొండమల్లయ్య గార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞత సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేను అందుబాటులో లేకున్నా మీ ప్రయత్నం, నా మీద ఉన్న అభిమానంతో 80 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ వచ్చిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేశారని, మీ కోసం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీకి ఒడిదుడుకులు కొత్త కాదన్నారు. దళిత, బీసీ బంధులతో పార్టీకి కొంత నష్టం జరిగినట్టు పార్టీ శ్రేణులు అధిష్టానం దృష్టికి తెచ్చారన్నారు. అదేవిధంగా యూట్యూబ్ ఛానళ్ల వల్ల కూడా కొంత నష్టం జరిగిందని.. చేసిన పనులు చెప్పుకోలేక పోయా మని వాపోయారు. విద్యార్థి, యువజన విభాగం సోషల్ మీడియాలో గట్టిగా పనిచేయాలని, కాంగ్రెస్, బీజేపీ గ్లోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక స్టేడియంలో డీసీసీబీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా కొద్దిసేపు క్రికెట్ ఆడారు. అలాగే పద్మశాలి నూతన భవనాన్ని ప్రారంభించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో కరాటే పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇందిరానగర్ బడి భేష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల నేడు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో 1,280 మంది విద్యార్థులతో విజయపరంపర సాగిస్తుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు స్నాక్స్, డిజిటల్ కంటెంట్ పుస్తకాలతో పాటు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు ఐప్యాడ్స్‌ను పంపిణీ చేశారు.

రైతుకు వెన్నుదన్నుగా నిలవండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ రేవతి తదితరులు

- సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి
- రైతు ఆత్మహత్యలపై పుస్తకం ఆవిష్కరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: రైతుకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ పాలనాపరమైన విధానాలను వర్తమాన ప్రభుత్వాలు రూపొందించి అమలు చేయాలని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్‌స్టడీస్ (సెస్) డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి అన్నారు. ప్రస్తుత విధానాలు రైతుకు భరోసాగా లేవని వ్యవసాయం చేయలేని పరిస్థితుల్లోకి గ్రామీణ వ్యవస్థ వెలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రద్ధానందం రచించిన రైతు ఆత్మహత్యలపై సామాజిక ఆర్థిక విశ్లేషణ అనే పుస్తకాన్ని శనివారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజురోజుకూ వ్యవసాయ ఖర్చులు పెరుగుతూ వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయి, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రద్ధానందం పుస్తకం రైతు ఆత్మహత్యలకు గల కారణాలను, అనంతరం కుటుంబ భారం మహిళలపై పడుతున్న తీరును చక్కగా వివరించిందన్నారు. డాక్టర్ నందని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా అనేక రైతు ఆత్మహత్యలను ఆకలి చావులను చవిచూసిందన్నారు. భవిష్యత్‌లో ఈ పుస్తకం పరిశోధనలకు ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమన్వయ కర్త డాక్టర్ గోపాలసుదర్శనం, శ్రద్ధానందం గైడ్ శివారెడ్డి, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపయ్య, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మల్లేశం, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుజాత, అధ్యాపకులు హరిబాబు, మహేందర్, మధుసూదన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ సందర్శన

సిద్దిపేటరూరల్: బుస్సాపూర్‌లోని తడి, పొడి చెత్త నిర్వహణ, బయోగ్యాస్ తయారీ, సీవరేజ్ ప్లాంట్‌ను సిద్దిపేట నర్సింగ్ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా శనివారం సందర్శించారు. ఈసందర్భంగా డంప్‌యార్డ్‌ను సందర్శించి బయోగ్యాస్ తయారీ విధానం వంటి విషయాలపై క్షేత్ర సందర్శన ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దీప్తి నాగరాజు, ప్రిన్సిపాల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరి, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మండిపడ్డారు. శనివారం గజ్వేల్‌లో ఆర్‌బీఎల్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, రైతాంగ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా 4 కోడ్‌లు రూపొందించిందని విమర్శించారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తూ రైతాంగాన్ని ఆదుకోవాలని, ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, నాయకులు భిక్షపతి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింలు, మల్లయ్య, రంగారెడ్డి, వెంకట్రావు, రాజగోపాల్, రవికుమార్, స్వామి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

జాతర.. పనులకు పాతర

కొమురవెల్లిలో భక్తులకు తప్పని తిప్పలు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి భక్తులకు తిప్పలు తప్పడం లేదు. జాతరకు ముందు భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. తాగునీరు, టాయిలెట్లు, పారిశుద్ధ్యం లాంటి మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కాని రెండు వారాలుగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన నల్లాలు పని చేయడం లేదు. దీంతో వంట చేసుకునేందుకు నీరు లేక భక్తులు అవస్థలు పడుతున్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో ఆలయ అధికారులు విఫలం అయ్యారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులు లీకై మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. పార్కింగ్ ప్రదేశాలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వసతితో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అనిల్‌ను వివరణ కోరగా శని, ఆది, సోమ, బుధ వారాల్లో 24 గంటలు నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. నీరు లీకై రోడ్డు పైకి రావడంతో వాటర్‌మెన్‌లు నీటి సరఫరా నిలిపివేశారన్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.



నిరుపయోగంగా మిషన్ భగీరథ నల్లాలు



పార్కింగ్ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్త

స్వల్ప భూప్రకంపనలు.. పరుగులు తీసిన జనం



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ వెంకటేశం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో పలుచోట్ల భూప్రకంపనలు సంభవించాయి. మిర్జాపూర్(ఎస్) ముంగి, టేకూర్, న్యాల్‌కల్, అత్నూర్, డప్పూర్, ఇబ్రహీంపూర్ తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో భూమి స్వల్పంగా కంపించింది. దీంతో ప్రజలు భయంతో బయటకు పరుగులు తీశారు. భూమి మళ్లీ కంపిస్తుందేమోననే ఆందోళన చెందారు. పెద్ద శబ్దాలు విన్నామని గ్రామస్తులు తెలిపారు. భూప్రకంపనల కారణంగా ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని సమాచారం. జహీరాబాద్ రూరల్ సీఐ నోముల వెంకటేశం ఆయా గ్రామాల్లో పర్యటించారు.

క్లుప్తంగా

కొండా సురేఖను కలిసిన మల్లన్న ఆలయ ధర్మకర్తలు



మంత్రి కొండా సురేఖతో మల్లన్న ఆలయ ధర్మకర్తలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయ ధర్మకర్తలు ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సచివాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జాతర సమయంలో పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయం వద్దకు చేర్చేందుకు ఎలక్ట్రిక్ ఆటోల కొనుగోలు, దాతల సాయంతో ఆలయంలో 120 వసతి గదులు నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆమె మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపినట్లు ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్లం శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, తాళ్లపల్లి రమేశ్, లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, కాంగ్రెస్ మండల నాయకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య



పరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోటని బొల్లారం పారిశ్రామిక ప్రాంతంలో గల మానక్సియా పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే.రాజయ్య డిమాండ్ చేశారు. శనివారం పరిశ్రమ వద్ద ఆయన మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కిందని, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్ల క్రితం ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే లాకౌట్ ప్రకటించిందన్నారు. కార్మికులకు ఎలాంటి న్యాయం చేయకుండా యంత్రాలను తరలించాలనే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆర్ వెంకటాపూర్ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన రావిపల్లి నరేందర్‌రెడ్డి (53) బైక్‌పై రామాయంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేందర్‌రెడ్డికు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నార్లాపూర్ గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి పరీక్ష.. పంటకు రక్ష

- దూరం కానున్న చీడపీడల ప్రభావం
- రసాయన ఎరువుల వాడకానికి కళ్లెం
- రైతులు సూచనలు సలహాలు పాటించాలి
- డా. పల్లవి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త





మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల రైతులకు మట్టినమూనా పరీక్షలంటే ఏంటో తెలియక తమకు తోచిన పంటలను సాగుబడి చేస్తున్నారు. మట్టి పరీక్షలు చేయించకుండా ఇబ్బడిముబ్బడిగా రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడుతున్నారు. ఇలా చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారు. మట్టి నమూనా పరీక్షలు చేయించకుండా సాగుబడి చేపడితే పొలంలో చీడ పురుగుల ఉధృతి, రసాయన ఎరువులను అధిక మోతాదులో వాడటంతోపాటు, పెట్టుబడులు పెరిగిపోవడమే కాకుండా పంట దిగుబడులు తగ్గిపోతాయని ఏరువాక కేంద్రం, ప్రొ.జయశంకర్ వ్యవసాయ విద్యాలయం తోర్నాల శాస్త్రవేత్త డా. పల్లవి హెచ్చరిస్తున్నారు. మట్టి నమూనా పరీక్షలపై రైతులకు ఆమె వివరాలు, సలహాలు, సూచనలు..

- సాగు చేయాలనుకుంటున్న రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తే భూమిలోని భూసారం ఎంత శాతం ఉందో తెలుసుకోవచ్చు.
- రైతు సాగుబడికి భూమితోపాటు, పెట్టుబడి, విత్తనం, నీరు చాలా ప్రధానమైనవి. భూమిలో ఉన్న లవణాలను, గుణగణాలను తెలుసుకోవాలంటే తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి.
- పంటల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు భూమిలో ఎంత మోతాదులో ఉంటాయన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది.
- సరైన సమయంలో మట్టి నమూనా పరీక్షలు నిర్వహిస్తే ఏఏ పంటల సాగుబడికి రసాయన ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, పెట్టుబడి పెట్టాలి, పంటలకు ఇంకెంత పోషకాలు అందించాలన్న విషయాలు అవగాహనకు వస్తాయి.

భూసార పరీక్షలతో మంచి ఫలితాలు



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

మట్టిని సేకరించే విధానం

- రైతులు తమ పొలంలో ఆంగ్లంలో 'వి' ఆకారంలో 15 సెంటీ మీటర్లు పారతో గుంతను తవ్వి మట్టిని సేకరించాలి.
- ఎకరం పొలంలో 8 నుంచి 10 చోట్ల మట్టిని సేకరించాలి. మొత్తం మట్టిని కలుపుకొని నాలుగు సమ భాగాలుగా విభజించాలి.
- విభజించిన వాటిలో కొన్ని మట్టి భాగాలను తీసివేస్తూ, 1/2 కిలోల మట్టి వచ్చే వరకు చేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, రప్పలు, చెత్తా చెదారం, చెట్ల వేర్లు, తడి లేకుండా చూడాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- మట్టిని సేకరించేటప్పుడు గట్ల దగ్గర, కాల్వల వద్ద, చెట్ల కింద, పశువుల పేడ, వర్మికం పోస్టు, పచ్చి రొట్ట కలిగిన స్థలాల నుంచి, నీరు నిల్వ ఉండే స్థలాల నుంచి ఎట్టి పరిస్థితుల్లో మట్టి నమూనాలను సేకరించొద్దు.
- పొలాల్లో వాలు, ఎత్తు, పల్లపు ప్రాంతాలుగా విభజించి వేర్వేరుగా సేకరించాలి.
- పండ్ల తోటలను సాగు చేయాలనుకుంటే ఎకరానికి 3 నుంచి 6 అడుగుల వరకు (1–2 మీటర్లు) గుంతలను తవ్వుకోవాలి. గుంతల నుంచి ప్రతి అడుగుకు కొంత మట్టి నమూనాను సేకరించి భూసార పరీక్షలకు పంపాలి.
- మట్టి నమూనాను సేకరించే సమయంలో లోతు నుంచి తీసుకోవాలి.

పొందుపర్చే విధానం

- సేకరించిన మట్టి నమూనాలపై రైతు పేరు, భూమి యొక్క సర్వే నంబర్, ఊరు, మండలం, అవసరమైతే ఫోన్ నంబర్‌ను తెలియజేయాలి.
- ఇది వరకు వేసిన పంట వివరాలు, ఇక ముందు సాగు చేయాలనుకుంటున్న పంట వివరాలు తెలియజేయాలి.
- ఈ విషయాలను సమగ్రంగా ఒక తెల్ల కాగితంపై రాసి మట్టి నమూనాల సంచిలో పెట్టి ఉంచాలి.

భూసార పరీక్షల అనంతరం

- భూసార పరీక్షల తర్వాత రైతు పొందుపర్చిన వివరాల ఆధారంగా సాగు చేయాలనుకుంటున్న పంటలకు కావాల్సిన ఎరువుల మోతాదును కనుగొనవచ్చు.
- పెట్టుబడులు, సాగు వివరాలను తెలియజేయవచ్చు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకాన్ని నియంత్రించొచ్చు. భూమిలో ఉన్న లవణ శాతాన్ని కనుగొని భూసారాన్ని పరీక్షించుకోచ్చు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- అపరిచితులను నమ్మి మోసపోవద్దు
- గజ్వేల్ ఏసీపీ రమేశ్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను నమ్మి మోసపోవద్దని గజ్వేల్ ఏసీపీ రమేశ్ సూచించారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో శనివారం సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటల్ ఆర్థిక, సైబర్ నేరాలు జరిగే విధానంపై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించి అభినందించారు. అనంతరం ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ విద్యాబోధన, ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోం, ఆన్‌లైన్ గేమ్స్, లోన్ యాప్స్ ద్వారా సైబర్ నేరాలు ఎక్కువగా జరిగాయని, ప్రజలు అప్రమత్తంగా లేకపోతే రానున్న రోజుల్లో సైబర్ క్రైమ్స్ మరింతగా పెరిగే అవకాశముందని తెలిపారు. సైబర్ నేరాల వలలో పడకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్, బ్యాంకు అకౌంట్ నంబర్, ఓటీపీలు, ఆన్‌లైన్ పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పొద్దన్నారు. సైబర్ నేరం జరిగినట్లు తెలిస్తే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట సైబర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సెయింట్ మేరీస్ విద్యానికేతన్ కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ప్రిన్సిపాళ్లు కాటా రాయప్ప, విజయపాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

12 క్వింటాళ్లు స్వాధీనం

గజ్వేల్‌రూరల్: అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పుద్దుటూరి నరేందర్ తన కిరాణ దుకాణంలో ప్రభుత్వం ద్వారా పంపిణీ జరిగే (పీడీఎస్) రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచాడు. పక్కా సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, నరేశ్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఇందులో 12 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలో అమర నరేందర్ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా డంప్ చేసిన ఇసుకను గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించగా.. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచితే సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే కంట్రోల్ రూం నంబర్ 87126 67100, టాస్క్‌ఫోర్స్ అధికారుల నంబర్ 87126 67447, 87126 67446 లేదా 100కు సమాచారం అందించాలని సూచించారు.

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు కారు బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని బోరపట్ల బస్‌స్టేజీ సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం ఏటిలింగపల్లి గ్రామానికి చెందిన వనంపల్లి నరేశ్, మండే రవీందర్ కారులో దౌల్తాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తుండగా బోర్పట్ల గ్రామ శివారులోకి చేరుకోగానే అదుపు తప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరేశ్, రవీందర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

చిన్నశంకరంపేట(మెదక్): రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కటికె ప్రభాకర్ మెదక్‌లో పని ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఇదే సమయంలో మండలంలోని కొర్విపల్లితండాకు చెందిన నేనవత్ చందర్ భార్య శాంతితో కలిసి మెదక్ వెళ్తున్నాడు. ఎస్.కొండాపూర్ బస్‌స్టాప్ సమీపంలోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ఘాతుకం
- గొంతు నులిమి చంపి ఆత్మహత్య కింద చిత్రీకరణ
- అనుమానాస్పద మృతి కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్/ములుగు: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన ములుగు మండలం బహిలంపూర్(ఆర్అండ్ఆర్ కాలనీ)లో చోటు చేసుకుంది. ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయంలో శనివారం గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ములుగు మండలం బహిలంపూర్(ఆర్అండ్ఆర్ కాలనీ)లో నివాసముండే గువ్వ నరేశ్ (30)కు 9 ఏళ్ల క్రితం క్షీరసాగర్ గ్రామానికి చెందిన లతతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. తరచూ దంపతుల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 25న రాత్రి 11 గంటల సమయంలో నరేశ్ బెడ్‌రూంలో విగతజీవిగా పడి ఉన్నాడు. భార్య లత వారి ఇంటి పక్కనే ఉంటున్న మామ మల్లేశ్ వద్దకు వెళ్లి నరేశ్ ఉరి వేసుకొని చనిపోయాడని చెప్పింది. మృతుని తండ్రి మల్లేశ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకున్నాడని చిత్రీకరణ..

గజ్వేల్‌రూరల్ సీఐ జానకీరామ్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. నరేశ్ భార్య లత, ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన జోగు భువనేశ్ అలియాస్ భాను క్షీరసాగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. అప్పటి నుంచే ఇద్దరి మధ్య పరిచయం కొనసాగుతోంది. పెళ్లి అయిన అనంతరం లత తల్లిగారిల్లు బహిలంపూర్‌కు వచ్చిపోయే క్రమంలో వంటి మామిడి వద్ద భాను కలిసేది. అక్కడే ఫోన్ నంబర్లు మార్చుకొని నిత్యం మాట్లాడుకునే వారు. ఇద్దరి మధ్య అక్రమ సంబంధం ఏర్పడి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరి విషయం భర్త నరేశ్‌కు తెలియడంతో లతను మందలించాడు. తమ పెళ్లికి నరేశ్ అడ్డు వస్తున్నాడని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేశారు. 25వ తేదీన రాత్రి నరేశ్ మద్యం తాగి పడుకున్న తర్వాత లత తన ప్రియుడు భానుకు ఫోన్ చేసి ఇంటికి పిలిచింది. ఇద్దరూ కలిసి నరేశ్ గొంతు నులిమి చంపేశారు. హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నరేశ్ ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఇంటి పైకప్పు కొండికి చీరను కట్టి వేలాడదీశారు. తమదైన శైలిలో భార్య లతను విచారించగా నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 2 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. 24 గంటల్లో కేసును ఛేదించిన గజ్వేల్ రూరల్ సీఐ జానకీరామ్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఏసీపీ రమేశ్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమేశ్, పక్కన సీఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్

హెరాయిన్ ముడి పదార్థం స్వాధీనం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): హెరాయిన్ తయారీలో ఉపయోగించే పాప్పి స్ట్రా పౌడర్ ముడి పదార్థాన్ని శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ రఘురామ్ వివరాలను వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సదాశివపేట మండల పరిధిలోని సూరారం గ్రామ శివారులో గల జాంబ్ శక్తి రాజస్థాన్ దాబాలో నమ్మదగిన సమాచారంతో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.లక్ష విలువ చేసే 355 గ్రాముల పాప్పి స్ట్రా పౌడర్ ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన అశోక్ కుమార్, రాకేశ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా ఈ ముడి పదార్థాన్ని రాజస్థాన్ నుంచి తీసుకొచ్చి దాబాకు వచ్చే వ్యక్తులకు అమ్ముతున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు రఘురాం తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు మోహన్ కుమార్, రమేశ్‌రెడ్డి, రజిత, ఎస్ఐలు విశ్వనాథ్, అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ముడి పదార్థాన్ని చూపుతున్న అధికారులు

ఆస్పత్రిలో చూపించుకొని వస్తుండగా..

కుప్పకూలి లారీ డ్రైవర్ మృతి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో కుప్పకూలి లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం... ఏపీలోని తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన వెంకటేశ్వర్లు(57) లారీ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 26వ తేదీన చెన్నై నుంచి లారీలో పాత టైర్ల లోడ్ వేసుకొని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడకు బయలుదేరాడు. 27వ తేదీ ఉదయం ఇస్నాపూర్ సమీపంలోకి రాగానే డ్రైవర్ వెంకటేశ్వర్లుకు ఛాతీలో నొప్పి వచ్చింది. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూయించుకున్నాడు. ఆస్పత్రి నుంచి మాత్రలు తీసుకొని వస్తుండగా ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ క్లీనర్ సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



వెంకటేశ్వర్లు మృతదేహం

అదృశ్యమై.. చెరువులో శవమై

పటాన్‌చెరుటౌన్: అదృశ్యమైన వ్యక్తి మృతదేహమై చెరువులో లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ము ఓడీఎఫ్ కాలనీకి చెందిన పున్న రావు శర్మ కుమారుడు శ్రావణ రాఘవ(29) సరైన ఉద్యోగం దొరకడం లేదని నిరాశకు లోనై ఆస్పత్రిలో చూయించుకొని మాత్రలు వాడుతున్నాడు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన శ్రావణ రాఘవ తిరిగి రాపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శుక్రవారం అమీన్‌పూర్ చెరువు వద్ద టీ షర్టు, షార్ట్, చెప్పులు కనిపించాయి. పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించని విషయం తెలిసిందే. శనివారం ఉదయం పెద్ద చెరువులో రాఘవ మృతదేహం తేలింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

మిరుదొడ్డి(దుబ్బాక): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని ధర్మారంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన నల్ల దివ్య, రాజు దంపతుల మధ్య కొంత కాలంగా కుటుంబ కలహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం దివ్య ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మేడ పైనుంచి పడి వ్యక్తి మృతి

కొల్చారం(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో మేడపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల మల్లేశం (38) గ్రామంలోని జాతీయ రహదారి పక్కన రెండస్తుల మేడ నిర్మాణం చేపట్టి ఇటీవలె గృహ ప్రవేశం చేశాడు. మల్లేశం భార్య స్వప్న మూడు రోజుల క్రితం ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. శనివారం ఉదయం చుట్టుపక్కలవారు లేచి చూసే సరికి మల్లేశం మేడ పైన నుంచి కిందపడి చనిపోయి ఉన్నాడు. వెంటనే మాచవరంలో అద్దెకు ఉంటున్న మల్లేశం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని చేరుకున్న తల్లిదండ్రులు కొడుకు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తమ కొడుకుని ఎవరో కావాలనే మేడపై నుంచి తోసి, ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. మృతుడి తండ్రి పోచయ్య పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం

- నగదు, బంగారం బూడిదపాలు
- భార్యాభర్తలకు స్వల్ప గాయాలు

కోహెడ(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వేల్పుల పోచవ్వ–చంద్రయ్య దంపతులిద్దరూ పూరి గుడిసెలో నివాసం ఉంటున్నారు. రోజుమాదిరిగానే వంట చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. భార్యాభర్తలు ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేసేలోపే పూర్తి కాలిపోయింది. ఈ ప్రమాదంలో 25 తులాల వెండి, 2 తులాల బంగారం, రూ.50 వేల నగదు కాలిబూడిద పాలైనట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తక్షణ సాయం కింద బియ్యం అందజేశారు. అదే విధంగా ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మంటల్లో కాలిపోతున్న గుడిసె

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి



నూతన కాంగ్రెస్ కమిటీ సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని పార్టీ గ్రామ అధ్యక్షుడు దండెబోయిన రాజేందర్ అన్నారు. శనివారం మండల ఉపాధ్యక్షుడు రంగు అశోక్‌గౌడ్ అధ్యక్షతన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సుద్దాల మహేందర్, జీడికంటి చంద్రం, ప్రధాన కార్యదర్శిగా అయిలయ్య, కోశాధికారిగా శ్రీనివాస్, సహ కార్యదర్శిగా బోగి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. అలాగే ఎస్సీ, బీసీ, మైనార్టీ, సోషల్ మీడియా సభ్యులను ప్రకటించారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సుష్మ దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన సందర్భంగా శనివారం విద్యార్థిని సుష్మ, సైన్స్ ఉపాధ్యాయుడు బ్రహ్మయ్యను ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సుష్మ చేసిన సాలుకు ఇరువైపుల సులభంగా ఎరువు వేసే పరికరాన్ని ఎంపిక చేశారు.

ఎన్‌వైకే సంఘటన్ జిల్లా అడ్వయిజరీ బోర్డు మెంబర్‌గా..



నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా అడ్వయిజరీ బోర్డు మెంబర్‌గా చిన్నకోడూరు మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన ముచ్చర్ల నాగరాజును మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ సాధారణ వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం నామినెటెడ్ పదవీ బాధ్యత అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. నెహ్రూ యువకేంద్ర సంఘటన్ తరపున యువతను క్రీడలతో పాటు వివిధ కార్యక్రమాల్లో భాగస్వామ్యులను చేయడం కోసం కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీలో చేరిన న్యాయవాదులు



న్యాయవాదులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్

హుస్నాబాద్: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ సమక్షంలో శనివారం హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు బీజేపీలో చేరారు. హుస్నాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో పార్టీ చేరిన న్యాయవాదులు పిట్టల దేవదాసు, విలాసాగరం మురళీమోహన్, బాలరాజు, మాధవిలకు బండి సంజయ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కోర్టు ఆవరణలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని కోరినట్లు మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి దేవేందర్, న్యాయవాదులు అజయ్ కుమార్, ఉప్పరపల్లి సంపత్, శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గోపీకృష్ణ



మంత్రి ఉత్తమ్‌ను సన్మానిస్తున్న గోపీకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపీకృష్ణ తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నేతలు సైనికుల్లా పని చేయాలని మంత్రి సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేర్చాలని సూచించారన్నారు. మంత్రిని కలిసినవారిలో యూత్ కాంగ్రెస్ నాయకులు వినయ్, నవీన్, అరవింద్, రితేష్ ఉన్నారు.

నెట్‌వర్క్ తిప్పలు

- కొండపోచమ్మ జాతరకు భక్తుల తాకిడి
- సిగ్నల్స్‌లేక పనిచేయని సెల్‌ఫోన్లు
- ఆన్‌లైన్ చెల్లింపులకు ఇబ్బందులు
- చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మీ ఫోన్ నంబర్ కవరేజీ ఏరియాలో లేదు..నంబర్‌కు నెట్‌వర్కు అందుబాటులో లేదు..కొంత సమయం వేచి చూడండి.. అంతే కాకుండా ఎన్నిసార్లు ఫోన్ చేసి ఎలాంటి చప్పుడు లేకుండా బంద్ కావడంతో కొండపోచమ్మ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఏటా జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌నర్సాపూర్‌లోగల శ్రీ కొండపచమ్మ జాతర సంక్రాంతి నుంచి ఉగాది వరకు కొనసాగుతుంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న ప్రతీ భక్తుడు కొండపోచమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కాగా ప్రతీ ఆది, సోమ, మంగళవారాల్లో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు. మొదటి వారం ఈనెల 22వ తేదీన కొండపోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొండపోచమ్మ ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. ఆ సమయంలో ఫోన్లకు సిగ్నల్ లేకపోవడంతో ఫోన్లన్నీ మూగబోయాయి. కొండపోచమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి నెట్‌వర్క్ సెల్‌టవర్లు లేకపోవడం, భక్తుల రద్దీ పెరగడం వల్ల ఫోన్‌లు పనిచేయడం లేదు. ఏటా ఇవే ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆలయ సిబ్బంది, భక్తులు చెబుతున్నారు.

నో నెట్‌వర్క్

మూడు రోజులపాటు కొండపోచమ్మకు వచ్చే ప్రతీ ఒకరికి సిగ్నల్ సమస్యలు తప్పడం లేదు. సెల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు ఎక్కువయ్యాయి. ఏ వస్తువునైనా కొందామన్నా చేతిలో నగదు లేక, ఆన్‌చెల్లింపులు చేయలేక భక్తులుపడే అవస్థలు వర్ణనాతీతం. ఆలయం వద్ద సిగ్నల్ లేకపోవడంతో స్థానికులు కూడా నానా అవస్థలు పడుతున్నారు.



కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ (ఫైల్)

సిగ్నల్ కోసం పరుగులు

జాతరకు వచ్చే భక్తులు టవర్ సిగ్నల్ కోసం ఆలయ పరిసర ప్రాంతాల వైపు పరుగులు పెడుతున్నారు. ఆలయం నుంచి జంగంరెడ్డిపల్లి వైపు లేదా చాట్లపల్లి వైపు వస్తేన్నే సిగ్నల్ వస్తుందని, దీంతో కిలోమీటర్ వరకు వెళ్లాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిగ్నల్ కోసం గుట్టలు, బిల్డింగ్‌లు ఎక్కి నానా తంటాలు పడుతున్నారు. సిగ్నల్ వచ్చేలా ఏదైనా సెల్‌టవర్ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీఐపీలు వస్తున్నారని తెలిస్తే ..

కొండపోచమ్మ జాతర సమయంలో భక్తుల రద్దీతో సిగ్నల్ సమస్యలు తలెత్తుతున్న మాట వాస్తవమే. ఆ సమయంలో నా ఫోన్ కూడా పనిచేయదు. ఎవరైనా వీఐపీలు వస్తున్నారని తెలిస్తే ముందుగానే సిగ్నల్ ఏరియాలోకి వెళ్లి సమాచారం తీసుకోవడం జరుగుతుంది. భక్తులు, పోలీసులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి సెల్‌టవర్ల సంస్థల దృష్టికి తీసుకెళ్తాం.

– మోహన్‌రెడ్డి, ఆలయ ఈఓ



నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్, ఉపాధ్యాయులు, లెక్చరర్లు

గురుకులాల బలోపేతానికి కృషి

టీఎస్ డబ్ల్యూఆర్‌టీఈ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల బలోపేతానికి టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈ కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె దయాకర్ అన్నారు. మండల పరిధిలోని అల్వాల–చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల/కళాశాలలో శనివారం 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక గురుకులాల ఉపాధ్యాయ బదిలీలను వెంటనే చేపట్టాలన్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించడానికి గురుకులాల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. గురుకులాల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, లెక్చరర్లు కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటరమణ, కృష్ణమూర్తి, గణేష్, సునీత, ప్రవళిక, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశం కోసం నోటిఫికేషన్ వెలువడిందని అక్కెనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రూ.125, ఇతరులకు రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు.



క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

దుబ్బాక: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని మిరుదొడ్డి ఎస్సై నరేష్ అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో డాక్టర్ బచ్చు పద్మనాభం స్మారక బ్యాట్మింటన్ షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిలో ఒత్తిడికి గురవుతున్న వారికి క్రీడలు ఎంతో ఉల్లాసాన్ని కలిగించి ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస్, రమణ మాట్లాడుతూ టోర్నీలో పాల్గొనడానికి జిల్లావ్యాప్తంగా దాదాపు 55 జట్లు పేర్లను నమోదు చేసుకున్నాయన్నారు. మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు సంతోష్, శ్రీకాంత్, అశ్రఫ్, సంతోష్, స్వామి, వేణు, సత్యనారాయణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్సై నరేష్

సర్పంచ్‌లను విస్మరించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లను విస్మరించిందని, చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇప్పుడు వారి గురించి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గురించి మాట్లాడే నైతికహక్కు సతీష్ కుమార్‌కు లేదన్నారు. పొన్నం ప్రభాకర్ స్వయం కృషితో రాజకీయంగా ఎదిగిన నాయకుడన్నారు. రాష్ట్రానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అనే విషయాన్ని పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి తెలుసుకోకపోవడం బాధాకరమన్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే బాస్ అన్నప్పుడు, హుస్నాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యే, మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ బాస్ అనే విషయం తెలియకుండా మాట్లాడటం సరికాదన్నారు. సమావేశంలో వివిధ మండలాల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, ధర్మయ్య, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, యాదవ రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మట్టిని తరలించిన వారిపై చర్యలేవి?

- గ్రామపంచాయతీని సుడా పరిధి నుంచి తప్పించాలి
- ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను అడ్డుకోవాలి
- మిట్టపల్లి గ్రామసభలో స్థానికుల డిమాండ్

సిద్దిపేటఅర్బన్: మెరుపుగుట్ట, దార గుట్ట మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్న అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని మిట్టపల్లి గ్రామస్తులు సర్పంచ్‌ను, పంచాయతీ కార్యదర్శి నిలదీశారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వంగ లక్ష్మి అధ్యక్షతన చివరి గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేసుకుంటూ జీవో 59 కింద దరఖాస్తులు చేసుకుంటున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మిట్టపల్లి గ్రామాన్ని సుడా పరిధి నుంచి తప్పించి గ్రామంలోని లేఅవుట్లపై, ప్లాట్‌లపై గ్రామపంచాయతీకి అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్చ్ ఫార్మా వల్ల గ్రామంలో కాలుష్యం పెరిగిపోతోందని దానిపై చర్యలు తీసుకోవాలని, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని 1500 మీటర్ల నుండి 300 మీటర్లకు తగ్గించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తెచ్చిన అంశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసభలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సంతోష్, గ్రామస్తులు మహేష్, జేపీ యాదవ్, రంజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో ప్రశ్నిస్తున్న యువకులు

పాలకేంద్రం అవకతవకలపై విచారణ

మద్దూరు(హుస్నాబాద్): లద్నూరు విజయ పాల కేంద్రంలో అవినీతి జరిగిందని పాల ఉత్పత్తిదారుల ఆరోపణలతో శనివారం పాల కేంద్రంలో 2016 నుంచి జరిగిన లావాదేవీలపై పాలకవర్గ సభ్యులు, ఉత్పత్తిదారుల సమక్షంలో సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుల సమ్మయ్య విచారణ జరిపారు. ప్రతీనెల ఉత్పత్తిదారులకు చెల్లించాల్సిన సొమ్మును చైర్మన్ తన సొంత అవసరాలకు రూ.4 లక్షలు వాడుకున్నట్లు విచారణలో నిర్ధారణ అయ్యింది. రూ.4 లక్షలు వాడుకున్నది నిజమేనని రెండు నెలల వ్యవధిలో డబ్బులు చెల్లిస్తానని చైర్మన్ హామీ పత్రం అందజేశారు. అనంతరం చైర్మన్‌ను వెంటనే మార్చాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉసర్పంచ్ కుమారస్వామి, ఉత్పత్తిదారులు దాసరి పద్మరెడ్డి, రాపాక బుచ్చిరెడ్డి, జీడికంటి సురేష్, రామడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

హుస్నాబాద్ నియోజకవర్గ జాక్ నూతన కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఉద్యమకారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు సమావేశమై పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవన్‌లో శనివారం నియోజకవర్గ జేఏసీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ కన్వీనర్‌గా కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య, కోకన్వీనర్లుగా కొయ్యడ కొమురయ్య, ముక్కెర సంపత్ కుమార్, చింతకింది శ్రీనివాస్, మండల జంపన్న, జగదీశ్వరచారి, షేక్ హుస్సేన్, చీకోటి రమణయ్య, పన్యాల రవీందర్ రెడ్డి, ఉప్పుల కుమారస్వామి, చెప్యాల ప్రకాష్, ఎదులాపురం తిరుపతి, మోహన్ నాయక్, బత్తుల బాబు, పన్యాల భూపతి రెడ్డి, కొమురెల్లి, సింగిరాల కనకయ్యలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాన్ని గుర్తించలేదని, త్వరలోనే మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానించనున్నట్లు జేఏసీ కన్వీనర్ తెలిపారు.



మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి

ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): ఫిబ్రవరి 6వ తేదీలోపు మండల పరిధిలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు సూచించారు. మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హులైన వారందరూ ఫిబ్రవరి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, గతంలో ఓటు వేసిన వారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని కోరారు.

యువకుడి ఔదార్యం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మజీద్ శనివారం సుమారు రూ.18 వేల విలువ చేసే స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు అందజేశారు.

సీఐకి అభినందనల వెల్లువ

దుబ్బాక: ఇటీవల ముంబైలో మారథాన్ పరుగు పందెం పోటీల్లో 42.5 కిలో మీటర్ల దూరాన్ని 3.50 గంటల వ్యవధిలో పూర్తి చేసిన దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణకు జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి శనివారం శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా మారథాన్ పరుగు పందెంలో పాల్గొన్న సీఐ యువతకు ఆదర్శంగా నిలవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, నాయకులు ఎల్లారెడ్డి, కృష్ణం రాజు తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కొల్గూరు గ్రామంలో జరిగిన చోరీ దాడిలో మృతి చెందిన శ్యామలత కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి శనివారం పరామర్శించారు. శ్యామలత మృతితో పాటు చోరీ ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ శ్యామలత మృతికి కారణమైన వ్యక్తిని త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలన్నారు. పరామర్శించినవారిలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): వరిసాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడి సాధించవచ్చని ఏఈవో శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని వరికోల్ గ్రామ రైతులు సాగుచేస్తున్న వరి పొలాలను పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు, జింక్‌లోప లక్షణాలు గమనించినట్లు తెలిపారు. పురుగు నివారణకు 3జీ కర్బోఫ్యూరాన్ గుళికలు ఎకరానికి 10 కేజీల చొప్పున లేదా కర్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 8 కేజీల చొప్పున పొలంలో పలుచగా నీరు ఉంచి చల్లాలన్నారు.

మైనర్ డ్రైవింగ్ నేరం

మిరుదొడ్డి(దుబ్బాక): మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమే కాకుండా, చట్ట ప్రకారం నేరమని భూంపల్లి ఏఎస్ఐ బాల మల్లేశం హెచ్చరించారు. శనివారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రయాణికులు, వాహనాదారులకు మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కలిగించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు పోలీసులు పెన్నులను బహుమతిగా అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్‌తండా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం గ్రామ సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్ నాయక్ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని బాలయ్యానాయక్‌తండా, పూసలతండా, తుక్కితండా, దూదియనాయక్‌తండా, తిరుమల్‌తండాలకు ఆర్టీసీ బస్సు రావడంలేదని, దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రెండ్రోజుల్లో గ్రామ పరిధిలోని రూట్‌సర్వే చేసి త్వరగా బస్సులు వచ్చేలా చూస్తానని డిపో మేనేజర్ చెప్పినట్లు సర్పంచ్ తెలిపారు.

మంత్రిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



జ్ఞాపికను అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేసినట్లు డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పంజాల రాజు తెలిపారు. కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దుబ్బాక సివిల్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రసాద్

దుబ్బాకటౌన్: దుబ్బాక సివిల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రగుంట ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బండి రాజు, గడ్డం భగవాన్, ప్రధాన కార్యదర్శిగా గాజుల రాంచంద్రం, కోశాధికారిగా బింగి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా స్వర్గం శ్రీనివాస్, వడ్ల రాజు, 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

◆ మృతుడి కుటుంబానికి పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర కరుణకర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉచిత దంత వైద్య శిబిరం

చేర్యాల(సిద్దిపేట): పంచతంత్ర స్కూల్‌లో శనివారం తెలంగాణ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 160 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి, దంత సంరక్షణకు పలు సూచనలు చేశారు. శిబిరం ఏర్పాటు చేసిన డాక్టర్ ప్రణీత్ యాదవ్‌ను పాఠశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో డైరెక్టర్ బాలకిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలో శనివారం దౌల్తాబాద్ మండల ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనైటెడ్ యూనియన్ సెక్షన్ సబ్ ఇంజనీర్ లక్ష్మణ్ చేతుల మీదుగా క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రామగౌని రవిశంకర్‌గౌడ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, లైన్‌మెన్ రాజేశం, జేఎల్ఎం నజీర్, సీఎల్ రాజశేఖర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

◆ పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వర్ధిల్లాలి

మిరుదొడ్డి(దుబ్బాక): భక్తి భావనతో పల్లెలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా వర్ధిల్లాలని మాధవానంద సరస్వతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మిరుదొడ్డి, లక్ష్మీనగర్, అరెపల్లి గ్రామ శివారులోని సదానందాశ్రమంలో జరుగుతున్న గీతాపారాయణం, శ్రీ మద్భాగవత పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మారుమూల పల్లెల్లో సైతం దైవ చింతన కలిగి ఉండటం శుభ పరిణామమన్నారు. భక్తితో నిండిన పల్లెలు ప్రశాంతతకు నిలయాలుగా మారుతాయన్నారు.

◆ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటి తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని మదర్సాలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ బాలికల వాలీబాల్ జట్టుకు స్పోర్ట్స్‌డ్రెస్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదర్‌పటేల్ మాట్లాడుతూ జనవరి 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు కర్ణాటకలో అండర్–19 జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు విజయరేఖ, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

గజ్వేల్‌రూరల్: బాలికలు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ప్రత్యేక అధికారి అనురాధ అన్నారు. శనివారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఎంతో కష్టపడుతుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ ఫిబ్రవరి 2న వేలం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు చేయడానికి వివిధ పనుల కోసం వేలం పాటను ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఈఓ కిషన్‌రావు శనివారం తెలిపారు. కొబ్బరికాయలు అమ్ముకొనే హక్కు, పూజ సామగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు విక్రయించే హక్కుల కోసం ఏడాది కాలానికి రూ.50 వేలు ఆలయంలోని కార్యాలయంలో డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లకు తడికల పందిళ్లు, వైట్ పెండల్స్ వేయడం, క్యూలైన్ ఏర్పాటు, కేటరింగ్, పూల అలంకరణ, దండలు అందించుట, టెంట్ సామానులు, సున్నాలు వేయడం, ఎలక్ట్రికల్, డెకరేషన్, సౌండ్ సిస్టమ్, విద్యుత్ దీపాల అలంకరణ చేసేందుకు టెండర్లు స్వీకరించనున్నట్లు తెలిపారు.